త్యాగానికి ప్రతీక బక్రీద్

- నేడు పవిత్ర బక్రీద్
- మసీద్, ఈద్గాలలో ప్రత్యేక నమాజ్‌లు


బక్రీద్ పండుగ వేడుకలకు సిద్ధమైన పొందుగలలోని ఈద్గా


బక్రీద్ పండుగ సందర్భంగా ప్రార్థనకు సిద్ధమైన నూర్ మసీదు

దాచేపల్లి : ముస్లింల పర్వదినమైన బక్రీద్ (ఈద్-ఉల్-జుహ)ను త్యాగానికి ప్రతీకగా జరుపుకుంటారు. ముస్లింల పవిత్రమైన పండుగలలో ఒకటి రంజాన్.. మరొకటి బక్రీద్. త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను నేడు (సోమవారం) జరుపుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు.

బక్రీద్ ప్రాధాన్యత ఇలా...

దైవ ప్రవక్త హాజరత్ ఇబ్రహీం(సా)కు అల్లా పెట్టిన అగ్ని పరీక్షలో భాగంగా ఏకైక కుమారుడు ఇస్మాయిల్ అలైహివస్సలాం ఎనిమిదేళ్ల వయస్సులో ఉన్న బాలుడిని దేవుడి పేరిట త్యాగం చేయాలని ఆజ్ఞ వస్తుంది. ఈ నేపథ్యంలో అల్లా కలలో ఆదేశించిన సూచనల మేరకు అడవిలో ఏకాంత ప్రదేశంలో రాతిపై ఇబ్రహీం(సా) కుమారుడు ఇస్మాయిల్‌ను సమర్పించేందుకు తీసుకెళతారు. వెంట పదునైన కత్తి కూడా తీసుకెళ్తారు. బాలుడు తనను ఎక్కడికి తీసుకెళ్లుతున్నారని చిలిపి మాటలతో తండ్రిని పలుమార్లు ప్రశ్నిస్తున్నా సమాధానం చెప్పలేదు. చివరకు అల్లా ఆదేశించిన ప్రదేశానికి తీసుకెళ్తారు. అక్కడకు వెళ్లి రాతిపై పడుకోబెట్టిన తరువాత కుమారుడికి అనుమానం కలిగి తనను సమర్పించమని అల్లా ఏమైనా ఆదేశించాడా.. అని ప్రశ్నిస్తాడు. దీనికి అవునని సమాధానం చెబుతాడు. దీంతో ఆ బాలుడు నాన్నా.. నా మీద ఉన్న ప్రేమతో కత్తితో గొంతుపై కోయలేవు.. నా మొహానికి బట్టకట్టి నాపై కత్తితో కోయాలని చెప్పాడు. బాలుడు చెప్పిన మేరకు గొంతుపై అతని తండ్రి వెంట తెచ్చుకున్న కత్తితో బలంగా కోసినప్పటికీ తెగలేదు. దీంతో బాలుడి తండ్రి కోపంతో రాతి గుండుపైకి కత్తిని విసరగా.. ఆ పదునుకు రాయి రెండు ముక్కలవుతుంది. దీంతో అల్లా దేవదూత అయిన జిబ్రయిల్(సా) అక్కడికి వచ్చి అల్లా పెట్టిన అగ్ని పరీక్షలో నెగ్గావు. నీ కుమారుడి బదులు స్వర్గం నుంచి అల్లా స్వయంగా పెంచిన బలమైన పోట్టేలును వెంట తెచ్చాను. దీన్ని జువా చేయాలని ఆదేశిస్తారు. దీంతో అప్పటి ప్రవక్త ఇబ్రహీం(సా) పొట్టేళ్లను జువా చేశారు. నాటి నుంచి నేటి వరకు అలాగే ప్రళయ దినం రోజు దాకా

బక్రీద్ పండుగ రోజున ఆర్థిక స్తోమత కలిగిన ప్రతి ఒక్కరు పొట్టేళ్లను జువా చేసి తండ్రి, కుమారుల త్యాగాన్ని స్మరించుకోవాలని హదీస్, ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ చెబుతోంది.

బక్రీద్‌కి ఏర్పాట్లు పూర్తి

బక్రీద్ పండుగ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని ఈద్గాలో వేలాదిగా ముస్లింలు చేరుకుని ప్రత్యేకంగా నమాజ్ చేస్తారు. పొందుగల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఈద్గాలో కూడా నమాజ్ జరుగుతుంది. నగర పంచాయతీతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో బక్రీద్ పండుగ జరుపుకునేందుకు మసీద్‌లు, ఈద్గాలను సిద్ధం చేశారు.

త్యాగానికి ప్రతిరూపం బక్రీద్

మాచర్ల రూరల్: మానవులలో త్యాగనిరతిని వ్యాపింపజేసి స్వార్థం, రాగ ద్వేషాలు వదిలి త్యాగ గుణాన్ని పెంపొందించేదే బక్రీద్ పండుగ. ముస్లింలు రంజాన్ పండుగ తరువాత జరుపుకునే అతి పెద్ద పండుగ బక్రీద్. ఇస్లాంలో త్యాగానికి ఒక ప్రత్యేక స్థానముంది. బక్రీద్ పండుగ త్యాగానికి సూచికగా నిలుస్తుంది. ఈద్ ఉల్ ఇదా అంటే త్యాగం సందర్భంగా చేసుకునే విందు అని అర్థం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లింలు ఇబ్రహాం, ఇస్మాయిల్, ఇస్లాం చరిత్రలో త్యాగానికి ప్రతీకగా వారి త్యాగానికి గుర్తుగా ఈ పండుగను జరుపుకుంటారు. ఇస్లాం ధర్మశాస్త్రం ప్రకారం దురాచారాలను, బడుగు, బలహీన వర్గాల అణచివేతను వ్యతిరేకించి యుగపురుషులు చేసిన త్యాగాలకు ప్రతిగా బక్రీద్ పండుగ విశిష్టతను తెలుపుతుంది. పేదలకు దాన ధర్మాలు చేసి తోటి వారిని ఆదుకోవాలనే లక్ష్యంతో బక్రీద్ పండుగ జరుపుకుంటారని ముస్లిం పెద్దలు తెలిపారు. ఈ నేపథ్యంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు పట్టణంలోని నూర్ మసీదులో పురపాలక సంఘ అధికారులు ఏర్పాట్లు చేశారు.

పటిష్ట బందోబస్తు



బక్రీద్ పండుగ వేడుకలు ప్రశాంతంగా జరుపుకునేలా చర్యలు తీసుకున్నాం. మసీద్‌లు, ఈద్గాల వద్ద ప్రత్యేక భద్రత చర్యలు చేపట్టాం. ఈద్గాలు, మసీద్‌లలో ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకున్నాం. పండుగ రోజున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నాం.

– ఎ.సురేంద్రబాబు, సీఐ, దాచేపల్లి

క్లుప్తంగా

ఘనంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం



వెల్దుర్తి: మండలంలోని గుండ్లపాడు గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మ అమ్మవారి 7వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. వేద పండితులు వెల్లంకి కృష్ణ శర్మ ఆధ్వర్యంలో గుండ్లపాడు గ్రామ అర్చకులు వెల్లంకి సుబ్రహ్మణ్య శర్మ 11 మంది వేద పండితులతో మహా వైభవంగా జరిగింది. గ్రామస్తులు, పలువురు మహిళలు జల బిందెలతో గ్రామ పురవీధులలో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. వేద పండితులు అమ్మవారికి గోపూజ, గణాధిపతి పూజ, చండీహోమం, రుద్రహోమం, మహన్యాసం, సహస్ర కలశ కుంభాభిషేకం నిర్వహించారు. మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధులలో ఘనంగా ఊరేగించారు. అమ్మవారి దేవాలయానికి రంగు రంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

కడుపు నొప్పితో యువకుడు ఆత్మహత్య



రెంటచింతల: మండలంలోని జెట్టిపాలెం గ్రామానికి చెందిన ఓ యువకుడు కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం జరిగినట్లు ఎస్‌ఐ ఎం.ఆంజనేయులు ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన ఇస్లావత్ సేవానాయక్ (26) కొంతకాలంగా కిడ్నీలో రాళ్లు ఉండటంతో నొప్పి భరించలేక ఈ నెల 13న పురుగుమందు (గడ్డిమందు) తాగి ఆత్మహత్యకు పాల్పడగా చిలకలూరిపేట పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపినట్లు వెల్లడించారు. అవివాహితుడు అయిన సేవానాయక్ కొన్ని సంవత్సరాలుగా సత్రశాల వద్ద నున్న ఏపీ జెన్‌కోలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నట్లు తెలిపారు. సేవానాయక్ అన్న ఇస్లావత్ కృష్ణానాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

క్రోసూరు: బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఎస్‌ఐ షఫీ అదుపులోకి తీసుకున్నట్లు ఆదివారం తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

అమరావతి: స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలనుకునే మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జన చైతన్య సమితి కో ఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ పొందటానికి 18 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాలలోపు వయసు కలిగిన మహిళలు అర్హులన్నారు. నెహ్రూ యువ కేంద్రం నేతృత్వంలోని జన చైతన్య సమితి ఆధ్వర్యంలో అమరావతిలోని శ్రీనివాస్ థియేటర్ వద్ద జన చైతన్య సమితి శిక్షణ కేంద్రంలో టైలరింగ్‌లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ప్రభుత్వ గుర్తింపు సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. అమరావతి, పెదకూరపాడు, తుళ్లూరు, క్రోసూరు మండలాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన ఆసక్తి కలిగిన మహిళలు మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, రేషన్ కార్డ్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో శిక్షణ కేంద్రంలో సంప్రదించాలన్నారు. మిగిలిన వివరాలకు 8886777767, 949227 1417,9492247893 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వైభవంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం



యడ్లపాడు: మండలంలోని వంకాయలపాడు గ్రామ దేవత పోలేరమ్మ ఆలయం పదవ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారికి పలు రకాల అభిషేకాలు, విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు గావించారు. గ్రామస్తులు, సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. గుడి ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు గుడి నిర్వాహకులు గ్రామస్తుల సహకారంతో అన్న సంతర్పణ చేశారు. నూతన రంగులు, విద్యుద్దీపాల వెలుగుల్లో ఆలయం వెలిగిపోయింది.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ


ఘటనా స్థలంలో పరిశీలిస్తున్న ఎస్‌ఐ ఆంజనేయులు


గేటు తాళాలు తీసిన దుండగులు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని ఆంజనేయస్వామి మాన్యం కాలనీలో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాలనీకి చెందిన మారకం శ్రీనివాసరాజు కుటుంబ సభ్యులతో కలిసి కుమారుడికి శస్త్ర చికిత్స చేయించడానికి ఈ నెల 14 శుక్రవారం సాయంత్రం విజయవాడకు వెళ్లారు. తిరిగి ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఇంటికి వచ్చి చూస్తే.. ఇంటి మెయిన్ డోర్ తాళం, బీరువా పగలగొట్టి దానిలో దాచుకున్న రూ.20 వేల నగదు, 8 గ్రాముల బంగారం దుద్దులు, 25 గ్రాముల వెండి పట్టీలు చోరీకి గురైనట్లు గమనించారు. బాధితుడు శ్రీనివాసరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ఎం.ఆంజనేయులు ఘటనా స్థలానికి చేరుకుని ఆ ఇంటిని నిశితంగా పరిశీలించి చుట్టు పక్కల ఇళ్లవారిని విచారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిడుగురాళ్లలో చోరీ

పిడుగురాళ్ల: ఇంటి బయట వేసిన తాళాలు వేసినట్లుగానే ఉన్నాయి. లోపల ఇంటి తలుపుల తాళాలు తీసి దొంగతనం చేసిన ఘటన జానపాడు రోడ్డులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఎదురు బజారులో కొలిశెట్టి వారి వీధిలోని ఒక ఇంటిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన తాతా కృష్ణారావు అనే వ్యాపారి కుటుంబ సభ్యులతో కలిసి సుమారు వారం క్రితం బెంగళూరులో బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంటి బయట గేటుకు, ఇంటి లోపల ప్రధాన గేటుకు రెండు తాళాలు వేసి ఊరికి వెళ్లారు. దొంగలు మాత్రం తెలివిగా తాళాలను పగలగొట్టకుండా, కట్ చేయకుండా దొంగ తాళాలతో తాళాలను తీసి ఇంటిలో ఉన్న సొత్తును అపహరించారు. ఆదివారం ఉదయం ఇంటి పక్కనే ఉన్న ఓ మహిళ ఇంటి ముందు ముగ్గు వేసేందుకు వచ్చి చూసే సరికి ఇంటి లోపల గేటుకు తాళాలు తీసి ఉండటాన్ని గమనించింది. బయట గేటుకు వేసిన తాళం అలానే ఉండటంతో కంగారు పడి కృష్ణారావు బంధువులకు తెలిపింది. బంధువులు కృష్ణారావుకు ఫోన్ ద్వారా ఇంట్లో దొంగలు పడ్డారని తెలిపారు. బెంగళూరులో ఉన్న కృష్ణారావు పట్టణ పోలీసులకు ఫోన్ ద్వారా విషయం చెప్పటంతో పోలీసులు కృష్ణారావును బెంగళూరు నుంచి రావాలని తెలిపారు. అయితే ఎంత సొత్తు చోరీకి గురైన సంగతి ఇంటి యజమాని కృష్ణారావు వచ్చిన తర్వాత తెలుస్తుందని, అప్పటి వరకు పూర్తి సమాచారం లేదని పట్టణ పోలీసులు తెలిపారు.

భార్యను వేధించిన భర్త మరో ఇద్దరిపై కేసు నమోదు

సత్తెనపల్లి: భార్యను వేధించిన భర్త మరో ఇరువురిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని భావనారుషి నగర్‌కు చెందిన ఎగ్గిరెడ్డి శ్రావణికి నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన ప్రణవ్ కుమార్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. రెండున్నర నెలలు మాత్రమే కలిసి ఉన్నారు. భర్త, అత్త, మరిది అధిక కట్నం కోసం వేధించడంతో ఆమె పుట్టింటికి వచ్చి కోర్టును ఆశ్రయించింది. సీఎఫ్ఆర్ రావడంతో పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

వైభవంగా కార్యసిద్ధి ఆంజనేయుడికి జలాభిషేకం


బిందెలతో నీటిని తెస్తున్న మహిళా భక్తులు


కార్యసిద్ధి ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: సకాలంలో వర్షాలు కురిసి పాడి, పంటలతో రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని కాంక్షిస్తూ పట్టణంలోని నాగన్నకుంటలో వేంచేసి ఉన్న కార్యసిద్ధి ఆంజనేయస్వామి వారికి ఆదివారం 108 బిందెలతో జలాభిషేక కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వేదాంతం రమణాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు తమ ఇళ్ల నుంచి మేళతాళాలతో ఒక్కొక్కరు ఒక బిందె చొప్పున దేవాలయానికి నీటిని తీసుకొచ్చి స్వామి వారికి వారి కుటుంబ సభ్యుల పేరు మీద అభిషేకం చేయించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నరాల సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ నీరజ



ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ నీరజ, పక్కన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: నరాలకు సంబంధించిన సమస్యలపై ప్రధానంగా మధుమేహ వ్యాధిగ్రస్తులు రక్తపోటుతో ఉన్నవారు అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ కె.నీరజ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆరోగ్యసభ ఆదివారం నిర్వహించారు. సమావేశానికి సంస్థ కార్యదర్శి కొండా శివ రామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధుమేహ వ్యాధిగ్రస్తులు సుగర్ లెవెల్స్‌ను నియంత్రించుకోవాలని కోరారు. రక్తపోటును నియంత్రణలో ఉంచుకోకుంటే బ్రెయిన్ స్ట్రోక్ కు దారి తీసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. సాధారణంగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన నాలుగు గంటల లోగా వైద్యుల వద్దకు వెళ్లగలిగితే చాలా ఉత్తమమైన ఫలితాలు వస్తాయని తెలిపారు. ఒక్కసారి బ్రెయిన్ స్ట్రోక్ వస్తే జీవితాంతం మందులు వైద్యుల సలహా మేరకు వాడాలని తెలిపారు. ఉన్నట్టుండి నడకలో గాని, మాటలో గాని, చూపులో గాని తేడాను గమనిస్తే అవి ఎక్కువ శాతం బ్రెయిన్ స్ట్రోక్‌కు సంబంధించిన సంకేతాలుగా భావించి వెంటనే న్యూరాలజిస్టును సంప్రదిస్తే మంచిదని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ నీరజను ఘనంగా సత్కరించారు. ఈ ఆరోగ్య సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్ గా వ్యవహరించగా, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ముప్పాళ్ల ప్రసాద్ రావు, సంస్థ సీనియర్ సభ్యులు ఆర్.రామచంద్ర రావు విశ్లేషకులు పాముల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాన్న ప్రేమకు ఎల్లలుండవని పిల్లలకు ఎలాంటి కష్టం తెలియకుండా పెంచి పెద్ద చేసేందుకు పిల్లలకు మంచి జీవితాన్ని ఇచ్చేందుకు తండ్రి పడే కష్టం అంతా ఇంతా కాదని ప్రముఖ గాయకుడు డి.టి.సాయిబాబు అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఫాదర్స్ డే నిర్వహించారు. సినీ దర్శకులు కె.జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రీమాత ఆవిర్భావ దినోత్సవం


ప్రత్యేక అలంకరణలో గాయత్రీమాత

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీశ్రీశ్రీ ఫిరోజి రుషీంద్రుల వారి మఠంలో వేంచేసిన పంచముఖ గాయత్రీమాత ఆవిర్భావ దినోత్సవ పూజలు ఆదివారం భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 108 కొబ్బరి కాయలు సమర్పించారు. పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో గల శివాలయం నుంచి కోలాటం, పసుపు, కుంకుమ కావిళ్లతో.. 24 కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆ కలశాలతో అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం గోమాతకు సీమంతం, సారె మహోత్సవం నిర్వహించారు. లక్ష్మి సహస్ర నామంతో కుంకుమార్చన, నరసింహస్వామి వారికి అష్టోత్తర శత నామ పూజ చేశారు. మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా శ్రీశ్రీశ్రీ ఫిరోజి రుషీంద్రుల ఉప పీఠాధిపతి ఫిరోజి బాబు నేతృత్వంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కుందురువారిపాలెంలో కలశ శోభాయాత్ర

కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని కుందురువారిపాలెం గ్రామంలోని సాందీపని ఆశ్రమం వారిచే గాయత్రీమాత జయంతి సందర్భంగా ఆదివారం కలశముల శోభాయాత్ర నిర్వహించారు. గాయత్రి పరివార్ సభ్యులు గ్రామంలోని ప్రధాన వీధుల్లో కలశములతో గాయత్రీమాత శ్లోకాలను పఠిస్తూ యాత్ర నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలో దీపయజ్ఞం నిర్వహించారు.

స్మార్ట్‌గా పేమెంట్

- ఎక్కడ చూసినా డిజిటల్ లావాదేవీలు
- ఆన్‌లైన్ పేమెంట్లకు చిరువ్యాపారుల మొగ్గు
- చిల్లర వెతలకు సైతం తప్పిన ఇక్కట్లు
- స్పీకర్ బాక్స్‌లతో మోసాలకు చెక్


పట్టణంలోని శీతల పానియాల దుకాణంలో డిజిటల్ పే చేస్తున్న కొనుగోలుదారుడు

సత్తెనపల్లి: ఇంటి నుంచి గతంలో బయటకు వచ్చే ముందు జేబులో డబ్బులు పెట్టుకొని వచ్చేవాళ్లు. బయట పనులపై తిరగడానికి ఎంత అవసరమవుతుందో ముందే అంచనా వేసుకొని తీసుకువచ్చేవాళ్లు. కానీ ఇప్పుడు కాలం మారింది. అంతా డిజిటల్ మయంగా మారింది. జేబులో రూపాయి లేకపోయినా స్మార్ట్ ఫోన్, మన బ్యాంకు ఖాతాలో డబ్బులు ఉంటే చాలు. దానితోనే ప్రతి లావాదేవీని సులభంగా చేయవచ్చు. కావాల్సిన వస్తువులు కొనాలన్నా, నచ్చిన ఫుడ్ తినాలన్నా, డబ్బులు వేరే వారికి పంపాలన్నా, మనం తీసుకోవాలన్నా అంతా చిటికెలో అయిపోతుంది. గతంలో మాల్స్, పెద్ద వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్లు ఇప్పుడు రోడ్డు పక్కన దుకాణాలు పెట్టే చిరు వ్యాపారులు చెంతకూ వచ్చేశాయి. పట్టణంతో పాటు, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని గ్రామాలకూ విస్తరించాయి. డిజిటల్ లావాదేవీలకు అవసరమైన స్కానర్ లేకుండా ఏ వ్యాపారిని చూడలేము.

కోవిడ్ అనంతరం మార్పులు

దేశంలో 2016లో రూ.500, రూ.1000 పెద్ద నోట్ల రద్దు జరిగింది. ఆ తర్వాత ఆర్థిక లావాదేవీలలో ఇబ్బందులను అధిగమించేందుకు డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించారు. కానీ అవి పెద్ద వ్యాపార సంస్థలకు మాత్రమే పరిమితమయ్యాయి. నగదు వేరే వారి ఖాతాల్లోకి వెళ్లిపోతుందన్న అపోహలు, ఆర్థిక మోసాలు జరుగుతాయన్న ఆందోళనతో గ్రామాల్లో వీటి జాడ పెద్దగా కనిపించేది కాదు. కోవిడ్ అనంతర పరిణామాలతో నగదు రహిత లావాదేవీలతో గణనీయమైన మార్పులు వచ్చాయి.

అన్నిచోట్ల ఆన్‌లైన్ చెల్లింపులే

ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే తదితర పేమెంట్ యాప్ సేవలతో అన్నిచోట్ల ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. కిరాణా, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్ బంకులు, ఇతర నిత్యావసర వస్తువుల దుకాణాలతో పాటు మొబైల్, డీటీహెచ్ రీచార్జులు, విద్యుత్, గ్యాస్ బిల్లులు, ఇతర ఆర్థిక లావాదేవీలు చాలా వరకూ ఈ యాప్‌ల నుంచే జరుగుతున్నాయి.

స్పీకర్ బాక్స్‌లతో మోసాలకు చెక్

ఆన్‌లైన్ చెల్లింపుల్లో ఉపయోగాలతో పాటు ఆదమరిస్తే మోసానికి గురయ్యే అవకాశం ఉంది. వీటిపై అవగాహన లేని వ్యాపారులను లక్ష్యంగా చేసుకొని కొందరు మాయగాళ్లు మోసాలకు పాల్పడుతుంటారు. సరుకులను కొనుగోలు చేసిన తర్వాత వేరే వారికి ఆ అమౌంట్ బదిలీ చేస్తారు. సెల్‌ఫోన్ స్క్రీన్‌పై వచ్చిన ట్రాన్సాక్షన్ సక్సెస్‌ఫుల్ మెసేజ్‌ను దుకాణదారుడుకే అమౌంట్ పే చేసినట్టు చూపించి అక్కడి నుంచి జారుకుంటారు. అయితే మార్కెట్లోకి వచ్చిన క్యూఆర్ కోడ్ స్పీకర్ బాక్స్‌లు ఇటువంటి అక్రమాలకు చెక్ పెడుతున్నాయి. ఆన్‌లైన్ చెల్లింపు జరగ్గానే ఎంత మొత్తం దుకాణదారు ఖాతాకు జమ అయిందనే విషయం స్పీకర్‌లో బయటకు వాయిస్ రూపంలో వినిపిస్తుంది. దీంతో డిజిటల్ మోసాలకు అడ్డుకట్ట పడుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

చిల్లర సమస్యకు పరిష్కారం

టీ స్టాళ్లు, రోడ్డు పక్కన హోటళ్లు, తోపుడు బండ్లు, సైకిల్ పై విక్రయాలు చేసే వారందరూ ఆన్‌లైన్ చెల్లింపులు ప్రోత్సహిస్తున్నారు. వీటి వల్ల ప్రధానంగా చిల్లర సమస్య ఉండటం లేదు. డిజిటల్ పేమెంట్లతో చిల్లర సమస్యకు పరిష్కారం లభించింది. పేమెంట్ యాప్‌లకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌లను ఆయా సంస్థల ఏజెంట్లు క్షణాల్లో అందజేస్తున్నారు. ఇప్పుడు ఏ దుకాణం వద్ద చూసినా క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు, బోర్డులు దర్శనమిస్తున్నాయి.

డిజిటల్ బ్యాంకింగ్

బ్యాంకుల్లో కూడా డిజిటల్ బ్యాంకింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. నగదు లావాదేవీలు చాలా వరకూ తగ్గిపోయాయి. వినియోగదారులు అధికంగా క్యాష్ లెస్ ట్రాన్సాక్షన్లు చేస్తూ ఇంటి నుంచే అన్ని రకాల సేవలు పొందుతున్నారు.


ఖైదీలను కలిసేందుకు అవకాశం

సత్తెనపల్లి: పట్టణంలోని సబ్‌జైల్లో ఉన్న ఖైదీలను కుటుంబ సభ్యులు, బంధువులు కలుసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు సబ్‌జైలు సూపరింటెండెంట్ టి.వెంకటరత్నం ఆదివారం తెలిపారు. ప్రస్తుతం వేసవి ఎండల తీవ్రత తగ్గినందున ఆదివారం నుంచే సబ్‌జైల్లో ఉన్న ఖైదీలను కుటుంబ సభ్యులు, బంధువులు కలుసుకునే ములాకాత్‌ల వేళలను పునరుద్ధరించామన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 3 గంటల నుంచి 4 వరకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని ఖైదీల కుటుంబ సభ్యులు వినియోగించుకోవాలని కోరారు.

'నేను బడికి పోతా' విజయవంతం చేయాలి

అమరావతి: మండల పరిధిలోని గ్రామాలలో ఐదేళ్లు నిండిన బడి ఈడు పిల్లలను నూటికి నూరు శాతం బడిలో చేర్పించటానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులందరూ ప్రత్యేక కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి-2 సీహెచ్ శివబాబు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన పుస్తకాలలో ఇంకా 7వ తరగతి పుస్తకాలు అందుబాటులో లేవని మిగిలిన తరగతుల వారికి పుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఎంపీపీ స్కూల్స్‌లో ఐదవ తరగతి, ఎంపీయూపీ స్కూల్స్‌లో ఏడవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించటానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. గ్రామాలలో పాఠశాలల పరిధిలో డ్రాపవుట్స్, స్కూల్‌లో అసలు చేరని పిల్లలను గుర్తించి బడిలో చేర్పించటానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు 'నేను బడికి పోతా' కార్యక్రమ విజయవంతానికి చిత్తశుద్ధితో కృషిచేయాలన్నారు. మండల పరిధిలోని పాఠశాలల్లో గతేడాది 4,928 మంది విద్యార్థులుండగా ఈ ఏడాది ప్రస్తుతానికి 3,967 మంది విద్యార్థులు ఉన్నారన్నారు.

117 జీఓను రద్దు చేయాలి



నరసరావుపేట ఈస్ట్: పాఠశాలలను విలీనం చేసే నంబరు 117 జీఓను రద్దు చేయాలని ఏపీఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా రాష్ట్రోపాధ్యాయ సంఘం ప్రథమ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న సుధీర్‌బాబు మాట్లాడుతూ 117జీఓను రద్దు చేసి, ఇంగ్లీషు మీడియానికి సమాంతరంగా తెలుగు మీడియంను కొనసాగించాలన్నారు. ఈ సమావేశంలో పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి, ఎస్టీయూ ఏపీ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు కాసా రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటకోటయ్య, జిల్లా మాజీ అధ్యక్షుడు గేరా మోహనరావు, గౌరవాధ్యక్షుడు షేక్ కరిముల్లా, రామలింగయ్య, కోల యేసయ్య, భీష్మారావు, ఎస్.రాఘవ, ఆంజనేయులు పాల్గొన్నారు.